సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



పాపాలను హరించే భోగేశ్వరుడు

పాతాళానికి పంచ బుగ్గల కోనేరు కలిగిన కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి శివరాత్రి మహోత్సవాలు 24 నుంచి జరుగనున్నాయి. 8లో



పరీక్షల వేళ ఆహార నియమాలు

త్వరలో టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు చదువుతో పాటు సరైన ఆహారం తీసుకోవడం తప్పనిసరి. 8లో



యువకుడి దారుణ హత్య

బావాయిపాలెంలో యువకుడి హత్య కలకలం రేపింది. దుండగులు అతడిని హతమార్చి కుడి చేతిని నరికి తీసుకువెళ్లారు. 8లో

న్యూస్‌రీల్

కళేబరాల తొలగింపు



అత్తిలిలో పాలూరు డ్యాం వద్ద పేరుకుపోయిన కళేబరాలు, చెత్తను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

అత్తిలి : 'పంట కాల్వల్లో వైరస్ కోళ్లు' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. అత్తిలి కాలువపై ఉన్న పాలూరు డ్యాం వద్ద, పాలూరు గ్రామంలో స్లూయిజ్ వద్ద పేరుకుపోయిన చనిపోయిన కోళ్ల, జంతు కళేబరాలను పొక్లయిన్‌తో తొలగించారు. ఈ కార్య క్రమాన్ని ఈఓపీఆర్డీ ఎం.శ్రీనివాస్, అత్తిలి, పాలూరు సెక్రటరీలు జి.భాస్కర్. యు. ప్రసాదరావు పర్యవేక్షించారు.

పరిశుభ్రతపై అవగాహన



ఏలూరులో ఐఓసీఎల్ అవగాహన ర్యాలీ

ఏలూరు(మెట్రో): గ్రీన్, క్లీన్ ఎనర్జీ ద్వారా పరిశుభ్రమైన పర్యావరణం అనే నినాదంతో ఆదివారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవగాహన నడక ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇండోర్ స్టేడియం నుంచి ఫైర్ స్టేషన్ మీదుగా జిల్లా ఆసుపత్రి వరకు ర్యాలీ సాగింది. ఎల్పీజీ సేల్స్ జనరల్ మేనేజర్ ఐఓసీఎల్ (విశాఖ) రవికుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఆయిల్ కంపెనీల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్‌ఎస్‌ఎస్ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిఒక్కరికీ గ్యాస్‌ను అందుబాటులో ఉంచిందన్నారు. ఎల్పీజీ సేల్స్ మేనేజర్ ఎంపీ రామ్‌ప్రసాద్, సహాయ పౌర సరఫరాల అధికారి వై.ప్రతాప్ రెడ్డి, గ్యాస్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మా.. నమోనమః

పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లాతో పాటు సమీప కృష్ణా జిల్లా నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో విశేష పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి లడ్డూ ప్రసాదంపై రూ.16,935, పూజా టికెట్లపై రూ.30,500, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,500, విరాళాల రూపంలో రూ.5,500 ఆదాయం సమకూరిందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

క్లాప్‌నకు మంగళం

'చెత్త'శుద్ధి కరువాయే!

- మూలకు చేరిన క్లాప్ ఆటోలు
- ఇంటింటా చెత్త సేకరణ నిలుపుదల
- గత ప్రభుత్వంలో జిల్లాకు 149 వాహనాల కేటాయింపు
- రోజుకు 300 టన్నుల చెత్త సేకరణ
- కూటమి పాలనలో ఎక్కడి చెత్త అక్కడే



భీమవరం మున్సిపాలిటీలో మూలకు చేరిన క్లాప్ వాహనాలు

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణాల పరిశుభ్రతే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమాన్ని అమలు చేసింది. ఇంటింటా చెత్త సేకరణకు ప్రత్యేక బ్యాటరీ వాహనాలను సమకూర్చింది. ఈ వాహనాలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వార్డుల్లో ఇంటింటా తిరుగుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించేవి. ఇలా జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు 149 వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. వీటి ద్వారా రోజుకు 300 టన్నుల చెత్తను సేకరించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్లాప్ కార్యక్రమాన్ని నిలిపివేసింది. దీంతో ఆయా మున్సిపాలిటీల్లో క్లాప్ ఆటోలు మూలకు చేరాయి. జిల్లాలోని పాలకొల్లు మున్సిపాలిటీలో మినహా మిగిలిన ప్రాంతాల్లో క్లాప్ అమలుకావడం లేదు.

కూటమి చరమగీతం

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్లాప్ కార్యక్రమానికి చరమగీతం పాడేశారు. దీంతో వాహనాలు నిరుపయోగంగా మారాయి. జిల్లాలోని భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాల్లో మూడు నెలలుగా క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరణ నిలిపివేశారు. దీంతో ఆయా మున్సిపాలిటీల్లో చెత్త సేకరణకు వాహనాల కొరత ఏర్పడి ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమంటూ ఉపన్యాసాలు ఇచ్చే సీఎం చంద్రబాబు పట్టణాల్లో చెత్త సేకరణ వాహనాలపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం. గత ప్రభుత్వంలో క్లాప్ కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు వచ్చాయి. పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని గాలికి వదిలేయడంతో రూ.5 లక్షల చొప్పున విలువ చేసే వాహనాలు దెబ్బతింటున్నాయి. క్యాబినెలు తుప్పుపట్టడం, ఇంజన్లు పాడవటం వంటివి జరుగుతున్నాయి.

కార్మికుల ఉపాధికి దెబ్బ

జిల్లాలో మున్సిపాలిటీల వారీగా భీమవరంలో 41, తాడేపల్లిగూడెంలో 40, పాలకొల్లులో 23, నరసాపురంలో 17, తణుకులో 28 క్లాప్ వాహనాలు పనిచేసేవి. రోజుకు సుమారు ఒక్కో వాహనం 30 కిలోమీటర్ల మేర తిరుగుతూ రెండు నుంచి మూడు టన్నుల చెత్త సేకరించేవి. మొత్తంగా 149 వాహనాలకు 149 మంది డ్రైవర్లు, ఐదుగురు సూపర్‌వైజర్లు ఉపాధి పొందేవారు. డ్రైవర్‌కు రూ.11 వేలు, సూపర్‌వైజర్‌కు రూ.15 వేల చొప్పున గత ప్రభుత్వం ఏజెన్సీ ద్వారా వీరికి జీతాలు అందించింది. ప్రస్తుతం పాలకొల్లులోని 23 వాహనాల్లో 19 మాత్రమే నడుస్తున్నాయి. క్లాప్ నిలిపివేయడంతో జిల్లాలో సుమారు 134 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. తమను విధుల్లో కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇదేనా 'స్వచ్ఛ ఆంధ్ర'?

కూటమి ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర..స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. క్లాప్ ఆటోలు మూలకు చేరడం, మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ వాహనాల కొరతతో చెత్త సేకరణ అధ్వానంగా మారింది. దీంతో పట్టణాల్లోని రోడ్డు మార్జిన్లు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. జిల్లాలోని మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ వాహనాలు భీమవరంలో 20కి 12, నరసాపురంలో 15కు 8, పాలకొల్లులో 10కి 6, తణుకులో 20కి 14, తాడేపల్లిగూడెంలో 20కి 14 మాత్రమే పనిచేస్తున్నాయి. పారిశుద్ధ్యం మెరుగులో కీలక పాత్ర పోషించిన క్లాప్ ఆటోలు లేకపోవడంతో ఇంటింటా చెత్త సేకరణ అంతంతమాత్రంగానే జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ ఎలా సాధ్యమవుతుందని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు.



భీమవరం రియలన్స్ బంకు వద్ద పేరుకుపోయిన చెత్త

63 వేల కోడి గుడ్లు పూడ్చివేత



బాదంపూడిలో గుడ్లను పూడ్చిపెడుతున్న దృశ్యం

ఉంగుటూరు: కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడం**తో బాదంపూడి** వెంకట మణికంఠ పౌల్ట్రీ **ఫారంలో మూడో రో**జు ఆదివారం కోళ్ల ఖననం **కార్యక్రమం కొనసా**గింది. పశుసంర్ధకశాఖ డాక్టర్లు, సిబ్బంది 43 వేల కోళ్లను ఖననం చేశారు. దీంతో ఫారంలోని 1.13 లక్షల కోళ్ల ఖననం ప్రక్రియ పూర్తయ్యింది. అలాగే వ్యాధి సోకిన కోళ్లు పెట్టిన 63 వేల గుడ్లను గొయ్యి తవ్వి పూడ్చిపెట్టారు. పశుసంవర్ధకశాఖ జేడీ డి.గోవిందరాజు పర్యవేక్షించారు. సోమవారం సమీప పెదతాడేపల్లిలోని ఫారంలో కోళ్ల ఖననం ప్రక్రియ చేపట్టనున్నారు.

డ్రోన్‌తో హైపోక్లోరైడ్ పిచికారీ

గ్రామంలో పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా సోడియం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని రెండు డ్రోన్ల ద్వారా పిచికారీ చేయించారు. 300 లీటర్ల హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించినట్టు పంచాయతీ కార్యదర్శి గిరిధర్ తెలిపారు. గ్రామంలోని రెడ్‌జోన్‌లో ఉన్న కిలోమీటర్ పరిధిలో ఈ పనులు చేయించారు.

నేడు పీజీఆర్‌ఎస్ రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జిల్లా, డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)ను జిల్లా వ్యాప్తంగా రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

మూడు నెలలుగా జీతాల్లేవ్

ఆకివీడు: తమకు మూడు నెలలుగా జీతాలు లే వని పెదకాపవరం పంచాయతీ సిబ్బంది డీపీఓ అరుణశ్రీ వద్ద వాపోయారు. పెదకాపవరంలో పన్ను వసూళ్లపై డీపీఓ ఆదివారం సమీక్షించారు. గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలో రూ.20 లక్షలకు పైగా పన్ను బకాయిలు ఉండటంపై సిబ్బందిని నిలదీశారు. వసూళ్లను వేగిరపర్చాలని సూచించారు. ఇటీవల సుమారు రూ.8 లక్షలు వసూలు చేసినట్లు సర్పంచ్ ఊసల బేబీ స్నేతు డీపీఓకు వివరించారు. ముందుగా డీపీఓ గ్రామంలోని ఎస్సీ కాలనీ, ఇతర ప్రాంతాల్లో పర్యటించగా తాగునీటి సమస్యను స్థానికులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. 15 రోజుల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని డీపీఓ చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసి సోమవారం నుంచి ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఎస్సీ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని మండిపడ్డారు. డీఎల్పీఓ బాలాజీ ఉన్నారు.



పెదకాపవరంలో మాట్లాడుతున్న డీపీఓ అరుణశ్రీ

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 3,395 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఆదివారం జరిగిన ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు 3,395 మంది హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు 38 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 3,511 మందికి 116 మంది గైర్హాజరయ్యారు. ఉదయం షిఫ్టులో 1,908 మందికి గాను 1,829 మంది, మధ్యాహ్నం షిఫ్టులో 1,603 మందికి 1,566 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్ బోర్డు పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు.

రాజబాబు మరణం పార్టీకి తీరని లోటు

ద్వారకాతిరుమల: వైఎస్సార్‌సీపీ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజమోహన్‌రావు (రాజబాబు) లేని లోటు పార్టీకి తీరనిదని ఆ పార్టీ ముఖ్య నేతలు అన్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆయన హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన భౌతిక కాయాన్ని ఆదివారం ఉదయం మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో స్వగృహానికి తీసుకువచ్చారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీలకు చెందిన పలువురు నేతలు రాజబాబు పార్థీవ దేహం వద్ద నివాళులర్పించారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత, మాజీ మంత్రి, పార్టీ తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పార్టీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పార్టీ రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్, పార్టీ కొవ్వూరు ఇన్‌చార్జి తలారి వెంకట్రావు, చింతలపూడి ఇన్‌చార్జి కంభంపాటి విజయరాజు తదితరులు రాజబాబు పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సీపీ ఆవిర్భావం నుంచి రాజబాబు పార్టీకి అందించిన సేవలు ఎనలేనివని అన్నారు. పార్టీ శ్రేణులకు ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉంటూ, పార్టీ బలోపేతానికి రాజబాబు చేసిన కృషి మరువలేమన్నారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, రాజమండ్రి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, జిల్లా బూత్ కమిటీల కన్వీనర్ గుర్రాల లక్ష్మణ్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, నరహరిశెట్టి రాజా తదితరులు ఉన్నారు.



రాజబాబు పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు

రాజబాబుకు డీఎన్నార్ నివాళి

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు పార్థీవదేహాన్ని పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) సందర్శించి నివాళులర్పించారు.

మామిడి.. తడబడి

చేయూత కరువై.. సాగు భారమై..

- మామిడి తోటలను నరికివేస్తున్న రైతులు
- తగ్గుతోన్న తోటల విస్తీర్ణం
- ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి



నూజివీడు మండలం రావిచర్లలో నరికిన మామిడి తోట



ట్రాక్టర్లలో తరలుతున్న మామిడి కలప

నూజివీడు: మామిడి తోటలకు ప్రసిద్ధి చెందిన నూజివీడు డివిజన్‌లో ఏటేటా తోటల విస్తీర్ణం తగ్గిపోతోంది. పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువవ్వడం, గిట్టుబాటు ధర లభించకపోవడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు వెరసి మామిడి రైతులు ప్రతి ఏటా నష్టాల బాటలోనే పయనిస్తున్నాడు. మామిడి తోటల ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో వాటిని నరికివేస్తున్నారు. ఈ భూముల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్నారు. మరికొందరు మొక్కజొన్న, పత్తి, మిరప,పొగాకు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేసి గ్యారంటీ ఆదాయం పొందుతున్నారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటినా ఐదేళ్ల వరకు అంతర పంటలుగా మొక్కజొన్న, కూరగాయలు, పుచ్చ, మిర్చి, పత్తి తదితర పంటలను సాగు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా మామిడిపై వచ్చే ఆదాయం క్రమేణా తగ్గుతోంది. ప్రతికూల వాతావరణం వల్ల పూతలు రాకపోవడం, వచ్చినా నిలవకపోవడం, వచ్చిన పూతలను రక్షించుకునేందుకు 12 నుంచి 15 సార్లు రసాయన మందులు పిచికారీ చేయడం, రెండేళ్లుగా నల్ల తామర పురుగుల ఉధృతి ఎక్కువ కావడం, పూర్తిగా మామిడి దిగుబడి పడిపోవడం తదితర కారణాలతో రైతులు ఆలోచనలో పడ్డారు. ఈ ప్రాంతంలో శతాబ్దాల తరబడి సాగులో ఉన్న మామిడి తోటలను తొలగించడానికి ఇష్టం లేకున్నా ఆదాయం రాకపోవడంతో చేసేదేమీ లేక తోటలను నరికి వేస్తున్నారు.

ఇతర ప్రాంతాల్లో పెరిగిన విస్తీర్ణం

ఒకప్పుడు మామిడి అంటే నూజివీడు ప్రాంతమే కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. ఇప్పుడు రాష్ట్రంలో ప్రకాశం, చిత్తూరు, కడప జిల్లాలతో పాటు పక్కనే ఉన్న తెలంగాణలో సైతం మామిడి తోటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో వ్యాపారస్తులు, హైదరాబాద్, గుజరాత్, బరోడా వంటి ప్రాంతాలకు చెందిన మామిడి సేట్‌లు కాయలను కొనుగోలు చేసేందుకు నూజివీడుకు కాకుండా ఇతర ప్రాంతాలకు సైతం వెళ్తున్నారు. ఒకప్పుడు మామిడి మార్కెట్లలోని కమీషన్ వ్యాపారస్తులే మామిడి వ్యాపారస్తులకు పెట్టుబడులు ఇచ్చి తోటలను కొనుగోలు చేయించేవారు. వారి వద్ద నుంచి కమీషన్ వ్యాపారస్తులు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది.

మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటైతేనే..

నూజివీడు ప్రాంతంలో బంగినపల్లి, తోతాపురి, చిన్నరసాలు, పెద్ద రసాలు వంటి రకాలను రైతులు సాగుచేస్తారు. వీటిలో అగ్రభాగం బంగినపల్లి రకం కాగా ఆ తర్వాత తోతాపురి ఉంటుంది. మామిడి తోటలు దాదాపు 40 వేల ఎకరాల్లో ఉన్నా మామిడి ఆధారిత పరిశ్రమలు ఇక్కడ లేవు. చిత్తూరు జిల్లాలో దాదాపు 60 వరకు జ్యూస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. దీంతో ఆ జిల్లాలోని దిగుబడితో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి కూడా తోతాపురి రకం కాయలు అక్కడి జ్యూస్ ఫ్యాక్టరీలకు వ్యాపారస్తులు ఎగుమతి చేస్తారు. మామిడి రైతులకు ప్రభుత్వం నుంచి చేయూత కరువు కాగా ఒకప్పుడు మామిడికి పేరెన్నికగన్న నూజివీడు ప్రాంతం ప్రాధాన్యతను కోల్పోతోంది.

కొన్నేళ్లుగా గడ్డుకాలం

కొన్నేళ్లుగా మామిడికి గడ్డుకాలం నెలకొంది. పూత వచ్చినా దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడం, దిగుబడి ఉన్నా మార్కెట్‌లో సరైన ధర లభించకపోవడం తదితర కారణాలతో రైతులు నష్టపోతున్నారు. తోటల దుక్కి, ఎరువులు, పురుగు మందులకు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి రైతులకు ఎదురవుతోంది. అలాగే ముదురు తోటలు కావడంతో ఎంత పెట్టుబడి పెట్టినా కాయకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. దీంతో భూములున్నా ఆదాయం లేక అప్పుల పాలవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

ఏడాదికి 4 వేల ఎకరాలు కనుమరుగు

ఏడాదికి నూజివీడు డివిజన్‌లో కనీసం 4 వేల ఎకరాలకు పైగా మామిడి తోటలను నరికివేస్తున్నారు. పేపర్ తయారీకి మామిడి కలపను వినియోగిస్తుండటంతో ఈ ప్రాంతంలోని ముదురు మామిడి తోటలకు గిరాకీ పెరిగింది. నరికిన తోటల్లో సగం తోటల వరకు మామిడి మొక్కలు వేస్తుండగా, మిగిలిన సగం మాత్రం ఆయిల్‌పామ్, ఇతర పంటలు సాగుచేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో మామిడి కనుమరుగయ్యే పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది.

తోట తొలగించి ఆయిల్‌పామ్ మొక్కలు వేశా..



మామిడి తోటలు కాపు కాసినా ధర లేక పెట్టుబడులు రాకపోవడం, గాలిదుమ్ములు వచ్చినప్పుడు కాయలు రాలిపోయి నష్టాలు రావడం, పూత వచ్చినా పురుగులు, తెగుళ్ల వల్ల పిందె ఏర్పడకపోవడం వంటి కారణాలతో నష్టాలు వచ్చాయి. దీంతో నాలుగెకరాల్లో మామిడి తోట నరికి వేయించి ఆయిల్‌పామ్ మొక్కలు వేశా. ఐదేళ్ల వరకూ అందులో అంతర పంటలను సాగు చేసుకోవచ్చు.

– పల్లె రవీంద్రరెడ్డి, తూర్పు దిగవల్లి, నూజివీడు మండలం

చేపల దొంగలు !

- చెరువులు ఎండగడుతున్న పచ్చ నేతలు
- అక్రమంగా చేపలు పట్టివేత
- పట్టించుకోని అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: మట్టి.. పుట్ట.. చెట్టు.. చేప.. కాదేదీ దోపిడీకి అనర్హం అన్నట్టు పచ్చనేతలు చెలరేగిపోతున్నారు. బడానేతలు పట్టిసీమ, తమ్మిలేరు మట్టి దోచుకుంటుంటే.. చోటామోటా నాయకులు గ్రామాల్లో చెరువులపై కన్నేశారు. ప్రజలకు తాగునీరు అందించే చెరువులను ఎండగట్టేస్తున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉన్నా అధికారులు మిన్నకుండిపోయారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా ప్రశ్నించలేకపోతున్నారు.

పోణంగి చెరువుకు ఎసరు

ఏలూరు నగర కార్పొరేషన్, 14 డివిజన్ పరిధి పోణంగిలో ఐదు ఎకరాల తాగునీటి చెరువు ఉంది. అధికారులు ఈ చెరువు నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేసేవారు. పశువులు దాహం తీర్చుకునేవి. రెండురోజుల క్రితం ఈ చెరువులో ఉన్న చేపలపై స్థానిక టీడీపీ నాయకుడి కన్ను పడింది. అధికారం అడ్డం పెట్టుకుని చెరువులో నీటిని తోడించేశాడు. ఆదివారం కూలీలతో చేపలు పట్టి అమ్ముకున్నాడు. ఇది చూసిన గ్రామ ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. రానున్నది వేసవికాలం కావడంతో చెరువు ఎండగడితే కనీసం పశువులు తాగేందుకు కూడా నీరు ఉండదని ఆవేదన చెందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గతేడాది ఏలూరు కార్పొరేషన్ అధికారులు చెరువులో చేపల వేలం పాట నిర్వహించి సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు.



పచ్చనేత సమక్షంలో పోణంగి తాగునీటి చెరువులో చేపలు పడుతున్న జాలర్లు



చాటపర్రులో ఎండగట్టిన తాగునీటి చెరువు

చాటపర్రులోనూ ఇదే తంతు

ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో సైతం పచ్చనేతలు ఇదే తరహా దందా కొనసాగించారు. కొద్దిరోజుల క్రితం పంచాయతీకి చెందిన 40 ఎకరాల తాగునీటి చెరువును ఎండగట్టారు. అక్రమంగా చేపలు పట్టి సొమ్ము చేసుకున్నారు. వారం పాటు సాగిన ఈ దందాపై అధికారులు కనీసం ప్రశ్నించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఈ చెరువులో చేపలను వేలం వేయగా సుమారు రూ.90 వేలు పంచాయతీ ఖజానాకు జమైంది.

రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

ఏలూరు(మెట్రో): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మానటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ఆమోదం పొందాలి. పెయిడ్ న్యూస్ రాజకీయ ప్రకటనలను పరిశీలించేందుకు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎంసీఎంసీ కమిటీని నియమించారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకి కనీసం మూడు రోజుల ముందు సంబంధిత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెండు రోజుల్లో దానిపై కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. ఎలక్ట్రానిక్ మీడియా రాజకీయ ప్రకటనలపై ఈసీ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ఎంసీఎంసీ సెల్‌ను ఏలూరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేశారు.

క్లుప్తంగా

సూర్యహంసినికి ఆర్చరీలో గోల్డ్ మెడల్



ఆర్చరీలో బంగారు పతకం సాధించిన ఎం.సూర్యహంసిని

భీమవరం: ఎన్టీపీసీ జూనియర్ నేషనల్ ఆర్చరీ చాంయపియన్‌షిప్ పోటీల్లో భీమవరం భారతీయ విద్యా భవన్స్ విద్యార్థిని ఎం.సూర్యహంసిని ప్రతిభ చూపిందని కోచ్ కమల్ కిషోర్ తెలిపారు. బాలికల వ్యక్తిగత విభాగంలో హంసిని ఢిల్లీకి చెందిన కుమిత్ సనానిపై గెలిచి బంగారు పతకం సాధించిందన్నారు. హంసినిని స్టేట్ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ, జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ జయరాజు అభినందించారు.

శ్రీవారి పథకాలకు రూ.7.21 లక్షల విరాళం



దాత లోహిత్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ అధికారి

ద్వారకాతిరుమల: శ్రీవారి పథకాలకు ఒక భక్తుడు ఆదివారం రాత్రి రూ.7.21 లక్షలు విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటకు చెందిన బొప్పరపు వెంకట లోహిత్ ముందుగా కుటుంబసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షలు, గోసంరక్షణ పథకానికి రూ.2,21,000 వెరసి రూ.7,21,000 జమచేశారు.

పెద్దింట్లమ్మా.. కోర్కెలు తీర్చమ్మా



పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తులు

కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. నీ భక్తుల కోర్కెలు తీర్చమ్మా.. అంటూ భక్తులు కొల్లేటి కోట పెద్దింట్లమ్మను ఆర్తితో వేడుకున్నారు. ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మకు నైవేద్యాలు, పాలపొంగళ్లు సమర్పించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదివారం ఒక్కరోజు ప్రత్యేక, అంతరాలయ, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డూ ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మవారి ఫొటోల అమ్మకం, భక్తుల విరాళాలు, వాహన పూజలు ఇలా అన్ని కలిపి రూ.52,396 ఆదాయం వచ్చిందని తెలిపారు.

పంట కాల్వలో గుర్తుతెలియని మృతదేహం

కైకలూరు: గుర్తుతెలియని మృతదేహం శ్యామలాంబపురం శ్మశాన వాటిక సమీప పంట కాల్వలో ఆదివారం కొట్టుకువచ్చింది. వీఆర్వో బి.సుబ్రహ్మణ్యేశ్వరరావు ఫిర్యాదు మేరకు కైకలూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు మాట్లాడుతూ మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండొచ్చన్నారు. ఎత్తు 5.5 అడుగులు ఉంటుందని చెప్పారు. వివరాలు తెలిస్తే 9440796434, 9440796433 నంబర్లకు తెలియజేయాలన్నారు.

పాపాలను హరించే పాతాళ భోగేశ్వరుడు

- కలిదిండిలో 24 నుంచి 28 వరకు కల్యాణ మహోత్సవాలు
- 11 శతాబ్దంలో నిర్మించిన అతి పురాతన శివాలయం



కలిదిండి భోగేశ్వరలంకలో పాతాళ భోగేశ్వరస్వామి



శివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయం



హరహరా అంటే బుడ బుడా శబ్దాలు చేసే పవిత్ర కోనేరు

కైకలూరు: పాతాళానికి పంచ బుగ్గల కోనేరు కలిగిన కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి దివ్య కల్యాణ శివరాత్రి మహోత్సవాలు ఈ నెల 24 నుంచి 28 వరకు జరగనున్నాయి. 11వ శతాబ్దంలో వేంగిరాజు రాజరాజచోళుడి కాలంలో నిర్మించిన ఈ శివాలయానికి దక్షిణ కాశీగా పేరు. తెలుగులో ఆది కావ్యానికి అంకురార్పణ జరిగిన పవిత్ర కోనేరు(పుష్కరిణీ)తో పాటు స్వామి పాదాల గుర్తులను ఇప్పటికీ భక్తులు తిలకిస్తున్నారు. ఏటా మాఘ బహుళ ఏకాదశి నుంచి అమావాస్య వరకూ పంచాహ్నిక కల్యాణ మహోత్సవాలు తిలకించడానికి కలిదిండికి తూర్పు ఆగ్నేయంలో 3 మైళ్ళ దూరంలో స్వామి దర్శనానికి లక్షల్లో భక్తులు విచ్చేస్తారు.

భోగేశ్వరలంకలో రైతు పొలంలో నాగలితో దున్నుతుండగా, నాగలి కర్ర తగిలి రక్తం పారుతూ స్వయంభూలింగం బయటపడింది. నాగలి కర్ర తగిలి విరిగిన భాగాన్ని అతికించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ భాగం ఒక పక్క విరిగినట్లుగా, అతికించినట్లుగా, ఆ భాగం నుంచి రక్తపు నీరు చమరిస్తున్నట్లుగా ఉంటుందని భక్తుల విశ్వాసం. ఈ లింగాన్ని కలిదిండి తీసుకొచ్చేందుకు రైతు విఫల యత్నం చేశాడు. ఆ రాత్రి స్వామి భక్తుల కలలో కనిపించి కోడికూత, రోకటి పోటు వినలేనంటూ ఏకాంతంగా ఉన్న ఈ చోటనే ఆలయ నిర్మించాలని కోరాడని ఇక్కడ స్థల పురాణం చెబుతోంది.

స్వామి పాదాల గుర్తులు

పూర్వం వర్షకాలంలో ఒక రోజున జోరున వర్షం కురుస్తుంటే స్వామి నిత్యార్చనకు ఆలస్యం జరిగిందట, దీంతో స్వామి వారు స్వయంగా ధ్వజస్తంభం ఎక్కి అర్చకుల రాకను గమనించి ధ్వజ స్తంభంపై నుంచి దూకడంతో కింద స్వామివారి పాదాల గుర్తులు ఏర్పడ్డాయని, వీటిని ఇప్పటికీ ప్రత్యక్షంగానే చూస్తున్నామని భక్తులు చెబుతారు. ఈ దేవాలయంలో నందీశ్వరుడికి విశేషంగా భక్తులు పూజలు చేస్తారు.

పంచ బుగ్గల కోనేరు..

కోనేరు వద్ద భక్తితో 'హరహరా' అంటే 'బుడబుడ' మంటూ నీరు పైకిరావడం భక్తులను పారవశ్యంలో ముంచెత్తుతుంది. పూర్వం ఆంధ్ర దేశాన్ని ఏలిన రాజరాజనరేంద్రుడు, కవి నన్నయలు తణుకులో నిర్వహించిన యజ్ఞం పూర్తి చేసుకుని ఆశ్వాలపై కలిదిండికి వచ్చారు. దారిలో ఓ నలుగురు అశ్వాల కంటే ముందు పరిగెత్తుతూ కోనేరులో దిగి మాయమయ్యారు. రాజు, నన్నయకు సరస్వతి దేవీ ప్రత్యక్ష్యమై మీకు ఎదురు పడింది 'భోగేంద్రులు – నాగేంద్రులు' అని చెప్పి ఇక్కడ కోనేరు ద్వారా పాతాళానికి వెళ్తారని తెలిపింది. ఒడ్డున నిలిచి పాతాళ భోగేశ్వరా హరహర అని పిలిస్తే బుడబుడ మంటూ బుడగలు వస్తాయని అమ్మ చెప్పిందని పురాణం. రాజరాజ నరేంద్రుడు ఆ నాలుగు పద్యాల కావ్యంలో శోభించేలా కవి నన్నయ్యభట్టుచే తొలి తెలుగు కావ్యం ఇక్కడే రాయించారంటారు.

తీర్థానికి అన్ని ఏర్పాట్లూ చేశాం



పాతాళ భోగేశ్వరుడి కల్యాణం తిలకిస్తే పాపాలు హరిస్తాయని నమ్మకం. ఈ నెల 25 అర్ధరాత్రి 1.25 గంటలకు స్వామి కల్యాణం జరుగుతుంది. శివ రాత్రి తీర్థానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. పవిత్ర కోనేరులో నీటిని నింపాం. సమీప ప్రాంతాల నుంచి లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

– వీఎస్‌కే.శేఖర్, ఈవో, పాతాళ భోగేశ్వరస్వామి దేవస్థానం

చోరీ చేసిన బైక్‌ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

ఏలూరు (టూటౌన్): బైక్‌ల దొంగతనం కేసును భీమడోలు పోలీసులు ఛేదించారు. డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదివారం వివరాలు వెల్లడించారు. చింతలపూడి మండలం బోయగూడెం గ్రామానికి చెందిన అక్కల రామచంద్ర రావు భీమడోలు మండలం సూరప్పగూడెం గ్రామంలో పొలం కౌలుకు చేస్తున్నాడు. పొలం షెడ్డులో ఉన్న అతని బైక్ చోరీకి గురైంది. దీనిపై భీమడోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ యుజె.విల్సన్ పర్యవేక్షణలో ఎస్సై వై.సుధాకర్, సిబ్బంది ఈ కేసును దర్యాప్తు చేశారు. ఏలూరు వంగాయగూడెంకు చెందిన వాసే రాజు అలియాస్ సంసోను, భీమడోలుకు చెందిన యర్రంశెట్టి పవన్ కుమార్‌ను అరెస్టు చేశారు. ముద్దాయిలు ఈ నెల 6న ఏలూరు గంగానమ్మ గుడి సమీపంలో వృద్ధురాలి మెడలోని బంగారు తాడును తెంపుకుపోయారు. వాసే రాజుపై గతంలో పలు పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయి. వారి నుంచి మూడు బైక్‌లు, బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

యువకుడి దారుణ హత్య

మృతుడి చేయి మాయం చేసిన హంతకులు



సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్, సీఐ సుభాష్



భార్య శ్రీవల్లితో మృతుడు ఏసు(ఫైల్)

నిడమర్రు: నిడమర్రు మండలం బావాయిపాలెం గ్రామంలో యువకుడి హత్య కలకలం రేపింది. గ్రామానికి చెందిన యువకుడు మజ్జి ఏసు(26)ను శనివారం రాత్రి అత్యంత దారుణంగా హత్య చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏసు తండ్రి ప్రసాద్ మరణించగా, తల్లి దుబాయ్‌లో ఉంది. ఏసు దుర్గా శ్రీవల్లిని 2023లో ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. ఉండి మండలం కలిగొట్ల గ్రామంలోని ఆక్వా చెరువుల కాపలాదారుడిగా పని చేస్తున్నాడు. భార్య 8వ నెల గర్భవతి కావడంతో తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. మృతుడితోపాటు అమ్మమ్మ మాత్రమే ఉంది. శనివారం అర్ధరాత్రి దాటాక బావాయిపాలెం శివారులో ఉన్న చినకాపవరం పంట కాల్వ వద్ద ఏసును చంపి, శవాన్ని కాలువ రేవు వద్ద పడేశారు. అతని కుడి చేయిని నరికి తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం సమాచారం అందిన వెంటనే నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై వీర ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. భార్య శ్రీవల్లి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ కూడా క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. హంతకులు ఒకరి కన్నా ఎక్కువ మంది ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడి ఇంటి పరిసరాల్లోనే డాగ్ స్క్వాడ్ కలియ తిరిగింది.

గల్లీ నుంచి ఢిల్లీకి

ఆదిమహోత్సవ్‌లో కేఆర్ పురం ఐటీడీఏ మిల్లెట్ బిస్కెట్ల స్టాల్



ఢిల్లీలో బిస్కెట్ స్టాల్‌ను ఏర్పాటు చేసిన గిరిజన మహిళలతో ట్రైపాడ్ ఎండీ

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద గిరిజన మహిళలు తయారు చేస్తున్న చిరుధాన్యాల మిల్లెట్ బిస్కెట్లు ఢిల్లీలో ఆదిమహోత్సవ్ కార్యక్రమంలో స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఏజెన్సీలో తయారీ చేసిననీ బిస్కెట్లు ఢిల్లీలో విక్రయించే అవకాశం రావడం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కొందరు గిరిజన మహిళలు ఐటీడీఏ అధికారుల సహకారంతో చిరుధాన్యాలతో గిరి వనిత పేరుతో మిల్లెట్ బిస్కెట్లు తయారీ చేసి కేఆర్‌పురంలోనే విక్రయాలు ప్రారంభించారు. రాగులు, సజ్జలు, సోయా, పెసలు, అలసందలు, మినుములు, ఓట్స్, బెల్లంతో బిస్కెట్లు తయారు చేయడంతో అందరూ వీటిని తినేందుకు ఇష్టపడుతున్నారు. అనతి కాలంలోనే ఈ బిస్కెట్లకు గిరాకీ పెరగడంతో క్రమంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా పలు షాపుల్లో ఈ బిస్కెట్లు విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో కూడా బిస్కెట్లు విక్రయిస్తున్నారు. ఇటీవల టాటా గ్రూప్ కంపెనీ ముంబయిలో నిర్వహించిన సమావేశానికి వచ్చిన వారికి ఇచ్చిన గిఫ్ట్ ప్యాకెట్‌లో గిరిజన మహిళలు తయారు చేసిన మిల్లెట్ బిస్కెట్‌లు ఉన్నాయి. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆదిమహోత్సవ్ (2025) కార్యక్రమంలో కూడా గిరిజన మహిళలు తయారు చేసిన మిల్లెట్ బిస్కెట్ల స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు తయారు చేసిన వస్తువులు ప్రదర్శనగా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆహ్వానంతో మిల్లెట్ బిస్కెట్ల తయారు చేసే పొట్టోడి బుల్లమ్మకు అక్కడ విక్రయించే అవకాశం లభించింది. జీలుగుమిల్లి మండలంలో ఉన్న నిర్వాసిత గ్రామం కొరుటూరు నుంచి మరో ఇద్దరు ఐటీడీఏ ద్వారా ఢిల్లీలో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వారు తయారు చేసిన వస్తువులను విక్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అన్ని ఐటీడీఏల పరిధిలో ఎంపిక చేసిన వస్తువులు ఈ స్టాల్స్‌లో విక్రయిస్తున్నారు.

పరీక్షల వేళ ఆహార నియమాలు



పదో తగతి విద్యార్థులకు స్టడీ క్యాంప్ (ఫైల్)



డాక్టర్ కొత్తపల్లి నరేష్, యర్రగుంటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి

చింతలపూడి: త్వరలో పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల వేళ విద్యార్థులు చదువు మీద ధ్యాసతో సరైన ఆహారం తీసుకోవడం మర్చిపోతారు. గంపెడు సిలబస్‌ను వడపోసి ప్రశ్నా పత్రాల్లో వచ్చే ప్రశ్నలకు జవాబులు రాయాలంటే ముందుగా విద్యార్థికి కావాల్సింది ఆరోగ్యం. ఈ నేపథ్యంలో పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు నెల రోజుల ముందునుంచే తేలికపాటి ఆహారం అందించడం ఉత్తమమని యర్రగుంటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కొత్తపల్లి నరేష్ తెలిపారు. రోజూ ఇంట్లో వండే వంటల్లోనే చిన్న, చిన్న మార్పులతో తేలికపాటి ఆహారాన్ని వండి పెట్టాలని సూచిస్తున్నారు.

ఏమేం తినాలి

- అధిక కారం, మసాలా, నూనెలతో తయారైన ఆహార పదార్థాలను తినకండి. వాటికి దూరంగా ఉండండి. రోజూ కనీసం 6 నుంచి 8 గంటలు నిద్ర పోవడం మంచిది. తేలికగా జీర్ణమయ్యే ఇడ్లీ, రసంతో భోజనం మంచిది. పెరుగు, మజ్జిగ పరిమితంగా తీసుకోవాలి.
- అందుబాటులో ఉండే తాజా పండ్లు తీసుకోవాలి. ద్రాక్ష, అరటి పండు, అనాస, దోస వంటి పండ్లు ఆరోగ్యానికి మంచిది. పరీక్షలు జరిగే రోజుల్లో మాంసాహారానికి దూరంగా ఉంటే మంచిది. మంచి ఆహారంతో పరీక్షల గండం గట్టెక్కినట్లే.

టైం టేబుల్

- మెదడు తాజాగా ఉండాలంటే పరీక్షల సమయంలో విద్యార్థులు ఉదయం 4.30 గంటలకు లేవడం రాత్రి 10.30 గంటలకు ముందుగా నిద్ర పోవడం అలవాటు చేసుకోవాలి.
- మెదడు చురుగ్గా పని చేయడానికి ప్రొటీన్లు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. ముఖ్యంగా చిక్కుడు, కూరగాయలు, పండ్లు తినాలి. ఉదయం లేచిన వెంటనే కొద్దిసేపు వ్యాయామం చేస్తే మంచిది. తరువాత ఇడ్లీ, పాలు తీసుకోవడం ఉత్తమం. అనంతరం చదువు ప్రారంభించాలి.
- పరీక్ష రాసి ఇంటికి వచ్చాక పండ్లు, పండ్ల రసాలు తాగాలి. పెరుగుతో ఆహారం తీసుకోవడం కూడా మంచిదే. సాయంత్రం చదువు ప్రారంభించేటప్పుడు కప్పు టీ తాగాలి. చదువడం అయిపోయాక నిద్రకు ఉపక్రమించే గంట ముందు తేలికపాటి భోజనం తీసుకోవాలి.
- ఒత్తిళ్లకు గురికాకుండా నిద్ర పోవాలి. రోజులో ఎక్కువ సార్లు పాలు తాగండి. మెదడు చురుగ్గా పని చేస్తుంది. ఒకసారి రాస్తూ చదివితే పదిసార్లు చదివినట్లు అర్థం.

కలుపు మందు తాగి యువకుడి ఆత్మహత్య

ప్రేమించిన యువతి బంధువుల బెదిరింపు



ఆడపా వీర రాఘవేంద్రకుమార్

భీమడోలు: ప్రేమించిన యువతి బంధువులు చంపేస్తామని బెదిరించడంతో భయంతో ఓ యువకుడు కలుపుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పూళ్లకు చెందిన యువకుడు ఆడపా వీర రాఘవేంద్రకుమార్(19) గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణకాలనీకి చెందిన ఆడపా రాఘవేంద్రకుమార్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 20న రాత్రి సమయంలో యువతి బంధువులు వచ్చి అమ్మాయికి పెళ్లి నిశ్చిమైందని.. ఆమె జోలికి రావద్దని, వస్తే చంపేస్తామని బెదిరించారు. భయంతో అదే రోజు రాత్రి ఆ యువకుడు కలుపు మందు తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రాఘవేంద్ర కుమార్ ఇచ్చిన మరణ వాంగ్మూలం మేరకు మృతికి కారణమైన సురేష్, సాయి, నాగులపై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

విద్యార్థుల్లో పోటీతత్వాన్ని అలవాటు చేయాలి



తణుకులో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

తణుకు అర్బన్: విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పోటీతత్వాన్ని అలవాటుచేయాలని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. ఆదివారం తణుకు తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చిన్ననాటి నుంచే మంచి నడవడిక, పెద్దలతో గౌరవంగా మెలగడం, పోటీతత్వాన్ని అనుకరించేలా చేస్తే భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదుగుతారని స్పష్టం చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ (జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్) నీట్ పరీక్షల్లో ఎంతో పోటీ ఉందని, ఆ ఒత్తిడిని తట్టుకుని మన పిల్లలు నిలవాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని అన్నారు. పిల్లలు ఎక్కువ సమయం మొబైల్స్‌తో గడుపుతున్నారని అది ఎంతో నష్టమన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రులదే ప్రముఖ పాత్ర అని, తల్లిదండ్రులనురోల్ మోడల్‌గా తీసుకుని వారిని అనుకరిస్తారని చెప్పారు. సదస్సుల్లో అకడమిక్ డైరెక్టర్ సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, తణుకు కాలేజ్ ప్రిన్సిపాల్ కె.దుర్గాప్రసాద్, తణుకు స్కూలు ఇన్‌చార్జ్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెదపాడు: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పెదపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని ఏపూరు హోసన్నా మందిర్ సమీపంలో ఒక వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. వివరాలు తెలిస్తే 9440796637 నెంబరుకు తెలియజేయాలన్నారు.

పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి



ఆటపాక కేంద్రంలో బోటు కోసం వేచి ఉన్న పర్యాటకులు

కైకలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పిలిచే ఆటపాక పక్షుల విహార కేంద్రం పర్యాటకులతో ఆదివారం సందడిగా మారింది. శీతాకాలపు వలస పక్షుల కేరింతలను ఆస్వాదించడానికి ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు విచ్చేశారు. బోటు షికారులో పెలికాన్, పెయింటెడ్ స్టోక్ పక్షుల అందాలను వీక్షించారు. అనంతరం ఈఈసీ కేంద్రంలో పక్షి నమూనా మ్యూజియంను సందర్శించారు. దీని సమీపంలోని చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు వివిధ ఆటలు ఆడుకున్నారు.

కోడి పందేలపై దాడి

ఉండి: మండలంలోని కలిసిపూడిలో నిర్వహిస్తున్న కోడి పందేలపై ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1600 నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: వివాహిత ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంకు చెందిన మహాలక్ష్మికి గుండుగొలనుకు చెందిన బొంతు నారాయణతో గత ఏడాది ఏప్రిల్‌లో వివాహమైంది. మహాలక్ష్మికి ఇటీవల అబార్షన్ అయ్యింది. వారం రోజుల క్రితం మహాలక్ష్మి మైసన్నగూడెం పుట్టింటికి వచ్చింది. అప్పటి నుంచి మనస్తాపంతో ఉన్న ఆమె ఈ నెల 15న ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందింది. కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసే సరికి చనిపోయి ఉందని, తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మైనర్లపై పోక్సో కేసు నమోదు

నూజివీడు: పట్టణంలోని అజరయ్యపేటకు చెందిన ఇద్దరు మైనర్లపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబసు తెలిపారు. అజరయ్యపేటకు చెందిన బాలిక ఈ నెల 15న కాలేజీ నుంచి ఇంటికి వస్తుండగా ఇద్దరు యువకులు బండిపై వచ్చి ఇంటి దగ్గర దించుతామని అడగగా బండి ఎక్కింది. వారిద్దరూ బాలికను ఇంటి వద్ద దించకుండా శ్మశానం వైపు తీసుకెళ్లారు. అక్కడ చేతులు వేయబోగా కేకలు వేసింది. దీంతో యువకులు బాలికను బండిపై ఇంటి వద్ద దించారు. బాలిక విషయాన్ని తల్లితో చెప్పగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

వినాయక ఆలయ ప్రారంభం



వేల్పూరు జగనన్న కాలనీలో విఘ్నేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న మాజీమంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు మండలం వేల్పూరు జగనన్న కాలనీలో కాలనీవాసులు నిర్మించుకున్న నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వరుడి ఆలయాన్ని ఆదివారం మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించారు. అనతరం విఘ్నేశ్వరుడికి కారుమూరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు నిర్మించి పేదల గుండెల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుడికట్టుకున్నారని అన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ వేల్పూరు నాయకులు నున్న దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు శ్యామల తదితరులు ఉన్నారు.

అభయ గణపతికి పంచామృత అభిషేకాలు



విశేషాలకంరణలో గణపతి స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాఘు బహుళ (సంకష్టహర) చవితి పురస్కరించుకుని స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీ కృష్ణ యోగ ధ్యాన మందిరంలో కొలువైన శ్రీ అభయ గణపతికి ఆదివారం సాయంత్రం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఇవటూరి శశికాంత్ శర్మ గణపతికి ప్రత్యేక పూజలు జరిపారు. అభిషేకం అనంతరం స్వామివారిని నూతన వస్త్రాలతో విశేషంగా అలంకరించి శ్వేతర్కా పుష్పాలతో పూజలు చేశారు. ఏర్పాట్లను మందిర అధ్యక్ష, కార్యదర్శులు పర్యవేక్షించారు.

ఎక్సైజ్ దాడులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆదివారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దే ఉచిత వైద్య సేవలు



తణుకులో వృద్ధుడికి వైద్య సేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటికే వైద్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటికి పరిమితమైన వృద్ధులకు ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, ఆర్థోపెడిక్ వైద్యుడు నిమ్మగడ్డ అచ్యుత రామయ్య తమ సిబ్బందితో కలిసి ఉచిత వైద్య సేవలు అందించారు. మండపాక, పైడిపర్రు, సజ్జాపురం ప్రాంతాల్లో ప్రత్యేక వాహనం ద్వారా వెళ్లి 8 మందికి వైద్యసేవలతోపాటు అసోసియేషన్ కార్యదర్శి ఎండీ స్వాలిహా ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి ఆదివారం ఈ ఉచిత వైద్యసేవల కోసం 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. వైద్యసేవల్లో సంఘ సభ్యులు గిరిజా నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది సహకరించారు.

ముగిసిన సంకేత 2025 సింపోజియం

భీమవరం: రెండు రోజుల పాటు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకేత 2కే25 జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం ఆదివారం ముగిసింది. రెండు రోజులు పాటు విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం బహుమతులు ప్రదానం చేశారు. రోబో వర్క్‌షాప్‌లో ప్రథమ స్థానం పొందిన ఎస్ఆర్‌కేఆర్ మెకానికల్ విద్యార్థులకు రూ.9 వేల నగదు బహుమతి ముఖ్య అతిథులుగా హాజరైన భీమవరం ఎస్వీఆర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఎన్వీ గోపాలరాజు, డాక్టర్ పి.లక్ష్మీప్రత్యూష చేతుల మీదుగా అందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు మెడికల్ ఇన్నోవేషన్‌లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాలైనా.. అభివృద్ధి అంతంతే

- హౌసింగ్ బోర్డు ఎంఐజీలో సమస్యల తిష్ట
- రోడ్లు, డ్రెయినేజీలు సక్రమంగా లేక స్థానికుల అవస్థలు



హౌసింగ్ బోర్డు కాలనీ ఎంఐజీలో అపరిశుభ్రంగా ఉన్న తూడు మురుగు గంట, వ్యర్థాలతో డ్రెయిన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): గూడెం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ ఏర్పాటై సుమారు నాలుగు దశాబ్దాలు సమీపిస్తున్నా అక్కడి అభివృద్ధి అంతంతమాత్రంగానే దర్శనమిస్తుంది. కాలనీలోని ఎంఐజీ ఇళ్ల వీధిల్లో సరైన కచ్చా డ్రెయిన్లు, సిమెంట్ రోడ్లు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో అయితే వీరి పరిస్థితి మరీ దారుణం.

ఎంఐజీలో నెలకొన్న సమస్యలు

స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ 1986లో ఏర్పాటైంది. ఇక్కడ రెండు వార్డుల ప్రజలు నివాసం ఉంటున్నారు. కాలనీని ఎంఐజీ, ఎల్ఐజీలుగా రూపొందించారు. నాటి నుంచి నేటి వరకు అభివృద్ధి అంతంతమాత్రమేనని అని స్థానికులు చెబుతున్నారు. ఎంఐజీ పరిసరాలైతే మరీ అధ్వానంగా ఉన్నాయి. చాలా చోట్ల ఎత్తుపల్లాలుగా మట్టి, కంకర రోడ్లు దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడ మాత్రమే సీసీ రోడ్లు ఉన్నాయి. ఇకడ డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్లల్లోని మురుగునీరు రోడ్డుపైనే నిలిచిపోయి దుర్వాసనతోపాటు దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్తకుప్పలతో ఖాళీ స్థలాలు

ఆయా ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాలు తుప్పులతో, చెత్త చెదారాలతో, వ్యర్థాలతో అస్తవ్యస్తంగా ఉన్నాయి. కొన్ని స్థలాలు మురుకి కూపాలు మాదిరిగా దర్శనం ఇస్తున్నాయి. పురపాలక సంఘం పారిశుధ్య సిబ్బంది వచ్చినా ఎక్కడ చెత్త అక్కడే ఉంటుందని వాపోతున్నారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య

ఎంఐజీ ప్రాంతంలో పాత పైపులైన్ వ్యవస్థ కారణంగా తాగునీటి సమస్యలతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పాత పైపుల స్థానంలో కొత్త పైపులైన్‌లు వేసినా వాటికి కనెక్షన్స్ ఇవ్వలేదని వాపోతున్నారు. వచ్చేది వేసవి కాలం కావడంతో త్వరగా కుళాయి సమస్యలను, తాగునీటి సమస్యలను పరిష్కరించకపోతే వేసవిలో తాము తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

హౌసింగ్ బోర్డును అభివృద్ధి చేయాలి



హౌసింగ్‌బోర్డును దాదాపు 39 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. సీసీ రహదారులు నిర్మించాలి, డ్రెయిన్‌లు కట్టాలి. అపారిశుధ్య పరిస్థితలను తొలగించాలి. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. – **జి.రంగారావు, స్థానికులు**

సమస్యల పరిష్కారానికి కృషి

హౌసింగ్‌బోర్డు ప్రాంతంలో కొత్త పైపులైన్‌లు, రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఇంజినీర్ వెంకటరమణ తెలిపారు. అలాగే దోమల నివారణకు కృషి చేస్తున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీమన్నారాయణ చెప్పారు. స్ప్రేయింగ్, ఫాగింగ్‌లు చేస్తున్నామని, చెత్తచెదారాలను ఎప్పటికప్పుడు తరలిస్తున్నామని వివరించారు.



ఎంఐజీలో అధ్వానంగా ఉన్న రోడ్డు



కచ్చా డ్రెయిన్‌లతోనే సరి



ఓ ఇంటి వద్ద కొత్త పైపులైన్ వేసినా కనెక్షన్ ఇవ్వని దృశ్యం

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు

తణుకు అర్బన్: పాఠశాల విద్యను బలోపేతం చేసే పేరుతో ఉపాధ్యాయులను ప్రభుత్వ విధానాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎస్వీ జాకబ్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెలా 3వ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులంతా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పాఠశాలల్లో విధుల్లో ఉండి, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు సుమారు 15 కిలోమీటర్లు ప్రయాణించాల్సి రావడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులకు ఈ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశాల కోసం ప్రయాణ సౌకర్యాలు కూడా లేని గ్రామాలకు చేరుకోవడం కష్టతరంగా మారిందని, తక్షణమే ఈ విధానాన్ని ప్రభుత్వం మార్చుకోవాలని జాకబ్‌బాబు డిమాండ్ చేశారు.

రేపు బీవీఆర్‌లో నెలవారీ సంగీత, సాంస్కృతిక సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో ఈ నెల 18వ తేదీన సాయంత్రం 6.30 గంటల నుంచి నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం జరుగుతుందని వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు తెలిపారు. భీమవరం స్వామజీ బృందంచే నాదస్వర సంగీతం, సభా, సత్కారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిమామిళ్ల పెద్దిరాజు, సభా ప్రారంభకులు ఎన్‌వీ రమణారావు, పీటీ వెంకన్న వ్యవహరిస్తారన్నారు. వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సాహితీ సభ్యులు, కళాకారులు, అభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

పనికోసం వెళ్లిన ఇద్దరు వ్యక్తులపై దాడి



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాధితులు

తణుకు అర్బన్: పని కోసం వెళ్లిన ఇద్దరు వ్యక్తులపై దాడికి దిగిన సంఘటన ఆదివారం తణుకులో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం 13వ వార్డు ఇరగవరం కాలనీలో నివసిస్తున్న బందెల రాంబాబు, విప్పర్తి ప్రభాకరరావు తణుకు పట్టణంలోని ఒక ఫంక్షన్ హాలులోకి పనికోసం వెళ్లగా అక్కడ ఉన్న వ్యక్తులు బూతులు తిడుతూ కర్రలు, పైపులతో దాడి చేశారని ఆరోపించారు. ఫంక్షన్ హాలు తలుపులు వేసి మరీ కొట్టారని కాళ్లు పట్టుకున్నా వదలలేదని బాధితులు చెబుతున్నారు. ఆస్పత్రిలో మధ్యాహ్నం 3 గంటలకు చేరినప్పటికీ పోలీసులు రెండు పర్యాయాలు వచ్చినా మా వద్ద ఎలాంటి వంటి స్టేట్‌మెంట్ తీసుకోలేదని వాపోయారు. అధికార పార్టీ సపోర్టుతో పోలీసులు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల విధుల్లో బదిలీ పనులు చేస్తుంటామని పనిలేక ఖాళీగా ఉన్నాం కదా అని పని దొరుకుతుందని లోపలకు వెళ్లినట్లుగా బాధితులు చెబుతున్నారు.

నేత్ర శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నేత్ర శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జనతా ట్రస్ట్ నిర్వహణలో దాత లయన్ పదం కుమార్ గుప్తా ఆర్థిక సహకారంతో నిడదవోలు రాజరాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ ఆసుపత్రిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి హనుమంతరావు (అనిల్) ఈ శిబిరాన్ని ప్రారంభించారు. నేత్ర శిబిరంలో 116 మందికి కంటి పరీక్షలు చేశారు. 20 మందికి కళ్లజోళ్లు ఇచ్చేందుకు నిర్ణయించగా, 14 మందిని శస్త్రచికిత్స నిమిత్తం నిడదవోలు ఆసుపత్రికి తరలించారు. లయన్ సుంకర శ్రీనివాస్, కార్యదర్శి చిన్నంద జగదీష్, భీమవరపు మహాలక్ష్మి, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, పచ్చ వెంకటేశ్వరరావు, వంగపండు రామోహన్‌రావు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



సినీ నిర్మాత అచ్చిరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

అత్తిలి: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం అత్తిలి షాదీఖానా భవనంలో నిర్వహించారు. అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1971–73 ఇంటర్మీడియేట్ బ్యాచ్ విద్యార్థులు 52 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల భరతనాట్యం, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. తమతో చదువుకున్న ప్రముఖ సినీ నిర్మాత కొవ్వూరి అచ్చిరెడ్డిని సత్కరించారు. అలాగే వారితో చదువుకుని మృతి చెందిన పలువురు పూర్వ విద్యార్థుల మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పోలిశెట్టి చంటి, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు మహమ్మద్ అబీబుద్దీన్, దిరిశాల ప్రసాద్, చిన్నం లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగుల పంపిణీ

భీమవరం: మన ఆరోగ్య రక్షణకు ప్లాస్టిక్ నిషేధించాలని ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ అన్నారు. భీమవరం పురపాలక సంఘం, విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సంత మార్కెట్‌లో ప్రజలకు ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్‌కు బదులుగా జిల్లా కలెక్టర్, యంత్రాంగం ప్రత్యామ్నాయలు ఏర్పాట్లు చేశారని, వాటిని వినియోగించుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంలో అందరూ భాగస్వాములై స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. అనంతరం గ్రంధి వెంకటేశ్వరరావు సంత మార్కెట్‌లో 200 మంది ప్రజలకు వబిలిశెట్టి రామకృష్ణ, కంతేటి వెంకటరాజు సహకారంతో క్లాత్ బ్యాగును సంచులను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, రామాయణం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను మీటింగులతో హింసించొద్దు

భీమవరం: క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగుల పేరుతో సరైన ప్రణాళిక లేకుండా సమావేశాలు నిర్వహించి ఉపాధ్యాయులకు తీవ్రమైన ఇబ్బంది కలుగజేయడం సరికాదని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ పశ్చిమ గోదావరి జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలోని అత్యధిక పాఠశాలల్లో అంతర్జాల సదుపాయం లేదని, ఒక క్లస్టర్ పరిధిలో ఒకటి లేదా రెండు ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉండడం వల్ల హాజరైన అతికొద్ది మంది పాఠశాల సహాయకులు ఏడు గ్రూపులుగా విడదీయడం వలన ఒక గ్రూపులో ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే ఉండడం వల్ల బోధనా భ్యాసన అంశాల గురించి చర్చకు తావు లేదని తెలిపారు. అలాగే ఒకటి రెండు తరగతులు బోధించేవారికి, మూడు, నాలుగు, ఐదు తరగతులను బోధించే వారికి వేరు చేయడం సహేతుకం కాదని అభిప్రాయపడ్డారు. క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరును తప్పనిసరి చేయడం, ఉద్దేశ్యపూర్వకంగా సమావేశమై అరగంట దాటితే అనుమతించకపోవడం అధికారులకు ఉపాధ్యాయులపై గల దురభిప్రాయం బయటపడుతుందన్నారు.

సజ్జాపురంలో అగ్నిప్రమాదం



సజ్జాపురంలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తణుకు అర్బన్: తణుకు సజ్జాపురం అండర్ గ్రౌండ్ ప్రాంతంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. జాతీయరహదారి బ్రిడ్జిని ఆనుకున్న ఉన్న ఖాళీస్థలంలో పాత సామగ్రి, చెత్త నిల్వల్లో చిన్నగా నిప్పు రాజుకుని మంటు భారీగా ఎగసిపడ్డాయి. అయితే మంటలు ఉధృతమవుతున్న సమయంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. మంటల ఉధృతి పెరుగుతుండడంతో స్థానిక భవనాల్లో నివసిస్తున్న ప్రజానీకం భయాందోళన చెందారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన రావడంతోనే జాతీయ రహదారి బ్రిడ్జిపై నుంచి నీటిని వదలి మంటలను అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం వార్త సమాచారంతో విద్యుత్ శాఖ సిబ్బంది కూడా స్పందించి సరఫరాను నిలుపుదల చేశారు. అయితే ప్రమాదంలో ఎటువంటి ఆస్తి నష్టంలేదని స్థానికంగా ఉన్న వృద్ధురాలు చేరవేసిన పాత సామగ్రి అంటుకుని ప్రమాదం జరిగినట్లుగా అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు





తణుకు సూర్యదేవాలయంలో పూజలందుకున్న దినకరుడు, క్యూకట్టిన భక్తులు

తణుకు అర్బన్: మాఘమాసం ఆదివారం సందర్భంగా తణుకు సూర్యదేవాలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తుల తాకిడికి సూర్యాలయం వీధి కిటకిటలాడింది. ఈ సందర్భంగా సూర్యభగవానుడిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో వచ్చిన భక్తులకు దేవదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదదాలు పంపిణీ చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ పర్యవేక్షించారు.

పేదల గుడిసెల తొలగింపు దారుణం

భీమవరం: దౌర్జన్యంగా పేదల గుడిసెలను తొలగించడం దారుణమని, దీనికి ఎన్నికల కోడ్ అడ్డు రాలేదా అని, సీపీఎం నాయకులు మండిపడ్డారు. ఆదివారం స్థానిక కోర్టు పక్కన పేదల గుడిసెలను పొక్లెయిన్‌తో మునిసిపల్ అధికారులు, పోలీసులను అడ్డం పెట్టుకుని పేదల ఇళ్లల్లో ఉన్న సామాన్లను బయట వేసి దౌర్జన్యం చేసి ఏడు కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని సీపీఎం వ్యతిరేకించింది. చంటి పిల్లలు, వృద్ధులు ఎక్కడికి వెళ్లాలో తెలియని స్థితిలో ఎండలో ఆకలితో అలమటిస్తూ మా గుడిసెలు తొలగించొద్దని వేడుకున్నా కనికరం లేకుండా దౌర్జన్యం చేశారు. దీనిపై సీపీఎం నాయకులు బి.వాసుదేవరావు, డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు సంఘటన స్థలానికి వెళ్లి పేదల తరపున అధికారులను నిలదీశారు. ఓ పక్క పాలకులు పేదలే దేవుళ్లు, ప్రజల కోసమే మేమున్నామని చెబుతూ మరో పక్క ఇలా దాడులు చేయడం దారుణమన్నారు. ప్రత్యామ్నాయం చూసుకునే అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి ప్రత్యామ్నాయం చూపించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పేదలకు టిడ్కో ఇళ్లను కేటాయిస్తామని, రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

జీడిపిక్కలతో జీవనోపాధి


- ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లో మహిళల స్వయం ఉపాధి
- జీడిపిక్కల వలుపుతో ఉపాధి పొందుతున్న 150 మంది మహిళలు



ఎల్.అగ్రహారంలో జీడిపిక్కలను బద్దలుగా చేస్తున్న దృశ్యం



జీడిపిక్క బద్దల నుంచి పప్పు వలుస్తున్న మహిళ



వలిచిన జీడిపప్పు

తాడేపల్లిగూడెం రూరల్: జీడిపిక్కల వలుపును స్వయం ఉపాధిగా ఎంచుకుని కుటుంబ ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నారు తాడేపల్లిగూడెంలో మండలంలోని ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లోని మహిళలు. ఈ రెండు గ్రామాలకు చెందిన దాదాపు 150 మంది మహిళలు ఈ పనిలో జీవనోపాధి పొందుతున్నారు. ఆయా గ్రామాల్లో ఏ వీధి చూసినా మహిళలు జీడిపిక్కల వలుపులో నిమగ్నమై కనిపిస్తారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం నుంచి ఉడక బెట్టిన జీడిపిక్కలను తీసుకొచ్చి ఈ మహిళలకు అప్పగిస్తారు. ఒకరు జీడిపిక్కను ముక్కలు చేస్తే మరొకరు పప్పును వేరు చేస్తారు. ఇలా ఒకే కుటుంబానికి చెందిన ఇరువురు మహిళలు ఒకరికొకరు సమన్వయంతో పనిచేస్తున్నారు. కిలోకు రూ.27 చొప్పున చెల్లిస్తారని ఆ మహిళలు చెబుతున్నారు. ఇలా ఒక్కో మహిళ రోజుకు 10 నుంచి 12 కిలోల జీడిపప్పును సునాయాసంగా తీసేస్తారు. 365 రోజులు పని ఉండటంతో జీడిపప్పు వలుపు పని పట్ల మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఆయా గ్రామాలు కుటీర పరిశ్రమగా వెలుగొందుతున్నాయి.

చేదోడు వాదోడుగా..



గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు కల్పించే ఉపాధి హామీ పథకం పనులు చూసుకుని తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత జీడిపిక్కల వలుపు పని చేస్తున్నాం. మగవారి కష్టం కుటుంబ అవసరాలకు పోయినా తమ కష్టంతో పిల్లలు, వ్యక్తిగత అవసరాలు తీర్చుకుంటున్నాం. కుటుంబ ఆర్థికాభివృద్ధికి చేదోడు

– ఏడిద లక్ష్మి, ఎల్.అగ్రహారం

ఇంటి వద్దనే ఉపాధి



ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామంలో పనులు లభించని పరిస్థితి. వేరే ప్రాంతాలకు వెళితేనే గాని ఉపాధి లభించదు. ఇటువంటి పరిస్థితుల్లో స్థానికంగానే ఇంటి వద్దనే జీడిపిక్కలు వలిచి, పప్పు తీసి ఇవ్వడం ద్వారా ఉపాధి పొందుతున్నాం. దీనివల్ల గ్రామాంతరాలు వెళ్లాల్సిన పనిలేదు.

– తోటసాని రాజేశ్వరి, ఎల్.అగ్రహారం